క్లుప్తంగా

ఆకట్టుకున్న విజ్ఞాన మేళా



విద్యార్థినులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

జన్నారం: మండల కేంద్రంలోని రాఘవేంద్ర లిటిల్‌హాన్స్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ విజ్ఞాన మేళా ఆకట్టుకుంది. రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ పాఠశాలకు ముఖ్య అతిథిగా హాజరై విజ్ఞాన మేళాను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వస్తువులను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డీన్ హేమలత షిండే, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో రేష్మ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను తెలియజేశారు. శానిటరీ క్లాత్‌లు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో హెలెన్‌డారతీ, సూపర్‌వైజర్ విజయ, సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విరమించుకోవాలి

పాతమంచిర్యాల: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ప్రైవేటీకరణను విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ కార్మికులకు భద్రత కరువైందని, హక్కులు అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కార్మికశాఖ కార్యాలయంలో పూర్తి స్థాయిలో అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు మంతెన మల్లన్న, మేకల సురేందర్, భగత్, రాజేష్, సారయ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో అధికారుల నిద్ర



పిల్లలతో కలిసి నిద్రిస్తున్న అధికారులు

వేమనపల్లి: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి హాస్టల్ నిద్ర కార్యక్రమం చేపట్టారు. పదో తరగతి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పరీక్షలు సమీపిస్తున్నందున ప్రణాళిక బద్ధంగా చదివి, వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, హాస్టల్‌లో ఏమైన సమస్యలు ఉన్నాయా అని వివరాలు తెలుసుకున్నారు.

విద్యార్థుల స్టడీ టూర్



జన్నారం: ఆదిలాబాద్ జిల్లా గుడి హత్నూర్, మన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు మంగళవారం స్టడీటూర్‌లో భాగంగా కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అడవిలో పర్యటించారు. గేట్ నంబర్ 1 నుంచి కాలినడకన అడవిలోకి వెళ్లారు. అడవిలో వన్యప్రాణులు, పక్షులను పరిశీలించి మురిసిపోయారు. అడవుల వల్ల కలిగే లాభాలు, సంరక్షణ గురించి బీట్ అధికారి లాల్‌బాయి, సిబ్బంది విద్యార్థులకు వివరించారు.

'తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడం దుర్మార్గం'

పాతమంచిర్యాల: కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడం దుర్మార్గమని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేయడమంటే, యావత్ బీసీ సమాజాన్ని అవమానించడమే అన్నారు. సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు రాజన్న, యాదవ్, సల్మాన్, కిరణ్, జయశంకర్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిరేవులో ఇసుక నిల్వలు సీజ్



దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి సమీపంలో రహస్య ప్రదేశాల్లో అక్రమంగా నిల్వచేసిన ఇసుకడంప్‌లపై 'గుడిరేవులో ఇసుక నిల్వలు' అనే కథనం 'సాక్షి'లో మంగళవారం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ సిబ్బంది మంగళవారం ఇసుక నిల్వలను సీజ్ చేశారు. ఇసుక నిల్వల చుట్టూ మార్కింగ్ చేసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. సీజ్ చేసిన ఇసుక సుమారుగా 110ట్రాక్టర్ ట్రిప్‌లు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

వాటర్‌ట్యాంక్ నిరుపయోగం..!



భీమారం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాటర్ ట్యాంక్ కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వాటర్ ట్యాంక్ అందుబాటులోకి వస్తే మధ్యాహ్న భోజన సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని, వినియోగంలోకి తేవాలని విద్యార్థులు కోరుతున్నారు.

నీటి మళ్లింపు కాలువతో జాగ్రత్త..!



మంచిర్యాలటౌన్: గోదావరి నదిలో నీరు లేకపోవడంతో, ప్రజల సౌకర్యార్థం నదికి అవతలి వైపునకు పారుతున్న నీటి ప్రవాహాన్ని మంచిర్యాల వైపునకు మళ్లించేందుకు నది మధ్యలో కాలువను తవ్వారు. నీరు కాలువ ద్వారా మంచిర్యాల వైపునకు ప్రవహిస్తుండగా, గోదావరి నదిలో స్నానాలు చేసేందుకు వెళ్లే భక్తులు కాలువలో పడే ప్రమాదం ఉంది. నీటి మళ్లింపుతో పుణ్యస్నానాలను చేసేందుకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకున్నా, జాగ్రత్తగా లేకుంటే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక కార్మికసంఘం ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ శివాజీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. సమానపనికి సమాన వేతనం ఇవ్వడం లేదని, జీహెచ్‌ఎంసీ కార్మికులకు ఇస్తున్న రూ.28వేల వేతనాలను తమకు ఇచ్చేలా చూడాలని కోరారు. కార్మికులకు రావాల్సిన బట్టలు, చెప్పులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, జనవరిలో కౌన్సిల్‌లో తీర్మానం చేసినా, కార్మికులకు బట్టలు, చెప్పులు ఇప్పటికీ ఇవ్వలేదని ఆరోపించారు. ఈ నెల 20వ తేదీ వరకు బట్టలు, చెప్పులను ఇవ్వని పక్షంలో ఒక్కరోజు రిలే నిరహారదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శ్యాంకుమార్, అధ్యక్షుడు గోగర్ల ఆశయ్య, ఉపాధ్యక్షుడు పల్లపు రాజేశ్వరి, ఓరగంటి దుర్గమ్మ, ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి తిరుపతి, జనరల్ సెక్రటరీ సుజాత, బూడిద తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

మందమర్రిరూరల్: రోడ్డు భద్రతా, రక్షణ సూత్రాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. జాతీయ రహదారి టోల్‌గేట్ వద్ద మంగళవారం రోడ్డుభద్రత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై అవగాహన కల్పించారు. ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ 363రహదారిపై ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 54మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని తెలిపారు. రాత్రి సమయాల్లో ఎక్కువగా రోడ్డుపై వాహనాలు నిలపడం వల్లనే ప్రమాదాలు జరిగాయని వివరించారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, కాసిపేట ఎస్సై ప్రవీణ్, జాతీయ రహదారి నిర్వహణ అధికారి సునీల్, సిబ్బంది, డ్రైవర్స్ ఉన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి



కాసిపేట: ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

తాండూర్/కాసిపేట: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షా కేంద్రాలను మంగళవారం సందర్శించి వసతులు పరిశీలించారు. ప్రశాంతంగా రాయాలని, ఒత్తిడికి గురికావొద్దని విద్యార్థులకు సూచించారు. పిల్లలపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి ఆశలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. విద్యార్థి జీవితానికి ఇంటర్మీడియెట్ విద్య ఎంతో కీలకమైందన్నారు. జీవితాన్ని మలుపు తిప్పే పరీక్షలను మెరుగ్గా రాసి ఫలితాల్లో ప్రతిభ చాటాలని సూచించారు. తాండూర్‌లో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, ఎస్సై సౌజన్య, ప్రిన్సిపాల్ కవిత, కాసిపేటలో చీఫ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: విద్యార్థులు వార్షిక పరీక్షలు ప్రశాంతంగా రాయాలని ఏసీఎంవో రాజమౌళి అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల వసతి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా, ఏకాగ్రతతో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏటీడీవో పురుషోత్తం, హెచ్‌డబ్ల్యూవో మల్లారెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ అన్నారు. స్థానిక మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. భయాన్ని వీడాలన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివి, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సదస్సులో ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్: పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ నస్పూర్ ఏఈ మల్లేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌లోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా అంతరాయం ఏర్పడునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు మంచిర్యాలకు మందకృష్ణ రాక

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి బుర్ర సతీశ్ మాదిగ తెలిపారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి మాదిగలు డప్పులతో హాజరు కావాలన్నారు.

8న నేషనల్ లోక్ అదాలత్

భీమారం: మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి ఆవరణలో ఈ నెల 8న నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మంగళవారం బ్యాంక్ మేనేజర్ సుబ్బారెడ్డి తెలిపారు. బ్యాంకులో రుణాలు పొంది ఇప్పటివరకు చెల్లించని మొండిబకాయిదారులు లోక్ అదాలత్‌లో రుణవిముక్తులు కావాలని ప్రజలను కోరారు. వన్‌టైం సెటిల్‌మెంట్ చేయనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్..

ఆసుపత్రిలో చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గ్లోబల్ ఆసుపత్రిలో చోరీ జరిగినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. సీసీ కెమెరాకు సంబంధించిన డీవీడీ, ఎల్‌ఈడీ సోనీ టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ కేబుల్స్, ఈసీజీ మిషన్ చోరీ అయినట్లు మంగళవారం ఆసుపత్రి నిర్వాహకులు వంశీ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఒడ్డెర కాలనీకి చెందిన ఒల్లెపు శివ ఈ నెల 3న రాత్రి 8గంటలకు బచ్చల సన్ని ఇంట్లో చొరబడ్డాడు. బీరు సీసాతో చంపుతా అని బెదిరించాడు. దీంతో సన్ని తల్లి నీలవేణి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వినిత పేర్కొన్నారు.

ఫేర్‌వెల్ హంగామా



దండేపల్లి: మండలంలోని లింగాపూర్ మోడల్‌స్కూల్, దండేపల్లి కస్తూర్బా పాఠశాలల్లో మంగళవారం ఫేర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు, తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థులు పలు సినీ, జానపద గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో అలరించాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

• జిల్లా విద్యాధికారి యాదయ్య

జన్నారం: ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య అందుతుందని డీఈవో యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ..ప్రభుత్వ పాఠశాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తున్నట్లు, పేద బడుగుబలహీన వర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామన్న, మండల విద్యాధికారి విజయకుమార్, ఎస్‌ఓలు చౌదరి, యశోద, సత్యనారాయణ మూర్తి, కలమడుగు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి, సీపీఎస్ అధ్యక్షుడు దాముఖ కమలాకర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, బాపు, నర్సయ్య, కందుల తిరుపతి, మోటివేషనల్ స్పీకర్ ప్రకాష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్, భీమిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం పదో విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉత్పాదకత పెంచుకోవాలి

• జీఎం శ్రీనివాస్



కార్మికులతో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: ఉత్పాదకత పెంచుకుంటేనే కంపెనీకి అనుకున్న లాభాలు వస్తాయని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌కి వెళ్లి కార్మికులతో మాట్లాడారు. సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, సంక్షేమం, కంపెనీ భవిష్యత్‌పై కార్మికులపై కార్మికుల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో ప్రధానంగా యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్షణతో పనిచేస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, మేనేజర్ బ్రహ్మాజీ, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, నాగభూషణం, మోతె లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు మంగళవారం సీహెచ్‌పీ హెచ్‌ఓడీ చంద్రమౌళికి వినతిపత్రం అందించారు. సీహెచ్‌పీలో ట్యాంకర్ లేక దుమ్ముధూళి లేచి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుమ్ముధూళి నివారణకు రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన క్లాడ్ టెక్‌ను కూడా వినియోగించకపోవడంతో కార్మికులు రోగాలబారిన పడుతున్నారని పేర్కొన్నారు. మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ మీటింగ్‌లకు అధికారులు హాజరు కాకపోవటం వల్ల ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయని వివరించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ, పిట్ కార్యదర్శి హరి రామకృష్ణ, సిరాజ్, విజయ్‌కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మందమర్రిరూరల్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మందమర్రి ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో భాగంగా ఏరియాలోని సీసీఆర్ క్లబ్ ఆవరణలో మంగళవారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై ఆటల పోటీలను ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వారికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీవైపీఎం ఆసీఫ్, అధికారులు, సమితి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



దండేపల్లి: స్వీట్లు పంచుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్/కోటపల్లి/దండేపల్లి/జైపూర్: ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ఘన విజయం సాధించడంతో మంగళవారం జిల్లా వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ నాయకుల మీద కేసులు పెట్టి, ఇబ్బందులకు గురిచేసినా బీజేపీ గెలుపును ఆపలేకపోయారన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్, నాయకులు జోగుల శ్రీదేవి, ముదాం మల్లేశ్, జయరామారావు, కంకణాల సతీశ్, పచ్చ వెంకటేశ్వర్లు, బూర్ల చిరంజీవి, కోటపల్లిలో మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, నాయకులు నాగేశ్వర్‌రావు, కందుల వెంకన్న, శ్యాంసుందర్, చంద్రయ్య, మల్లయ్య, సంతోశ్, జైపూర్‌లో మండల అధ్యక్షుడు దూట రాజ్‌కుమార్, నాయకులు తిరుపతిగౌడ్, సెగ్యం సంతోశ్, రవి, మునీందర్‌రెడ్డి, సాయిరాం, చంద్రమౌళి, మొగిలి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన

భీమిని: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, స్నాక్స్ అందించాలని మండల ప్రత్యేకాధికారి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం ఎంపీడీవో గంగామోహన్‌తో కలిసి సందర్శించారు.